సాక్షి
బాపట్ల
మంగళవారం । 5 । సెప్టెంబర్ । 2023




దుర్గమ్మ సేవలో ఐఏఎస్

విజయవాడ : ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మను మహారాష్ట్ర ఉప లోకాయుక్త, ఐఏఎస్ సంజయ్ భాటియా దంపతులు సోమవారం దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు చేశారు.



నిత్యాన్నదానానికి విరాళం

విజయవాడ : శ్రీ దుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానంలో జరుగుతున్న నిత్యాన్నదానానికి విజయవాడకు చెందిన భక్తులు సోమవారం రూ.లక్ష విరాళాన్ని అందజేశారు.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం సోమవారం 524.00 అడుగుల వద్ద ఉంది. ఎస్ఎల్‌బీసీకి 450 క్యూసెక్కులు విడుదలవుతోంది.

న్యూస్‌రీల్

అమరేశ్వరుని పవిత్రోత్సవాలు ప్రారంభం



అమరావతి: ప్రసిద్ధ శైవ క్షేత్రం అమరావతి అమరేశ్వరాలయంలో సోమవారం పవిత్రోత్సవాలను శాస్త్రోక్తంగా ప్రారంభించారు. తొలిరోజు వేదపండితులు ఉదకశాంతి, ఆలయశుద్ధి, ప్రధాన, ఉపాలయాలమూర్తులకు అభిషేకాలు, అర్చనలు కలశారాధన, అగ్ని మథనం, హోమాలు, గోపూజ నిర్వహించారు. మంగళవారం రెండోరోజు మండప పూజలు, దీక్షాహోమాలు, మూలమంత్ర హవనములు, రుద్రహోమం, పవిత్రారోపణం, చండీహోమం నిర్వహిస్తామని ఆలయ ఈఓ వేమూరి గోపినాథశర్మ తెలిపారు.

చేబ్రోలులో 36.8 మి.మీ వర్షం

కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు జిల్లాలో ఆదివారం ఉదయం నుంచి సోమవారం ఉదయం వరకు అత్యధికంగా చేబ్రోలు మండలంలో 36.8 మిల్లీ మీటర్ల వర్షం పడగా, అత్యల్పంగా తుళ్ళూరు మండలంలో 0.4 మి.మీ వర్షం పడింది. సగటున 6.3 మి.మీ. వర్షపాతం నమోదైంది. వివిధ మండలాల్లో నమోదైన వర్షపాతం వివరాలు ఇలా ఉన్నాయి.. ప్రత్తిపాడు మండలంలో 34.8 మి.మీ., పొన్నూరు 13, పెదనందిపాడు 11.8, వట్టిచెరుకూరు 8.2, గుంటూరు పశ్చిమ 5.4, గుంటూరు తూర్పు 1.8, తాడికొండ మండలంలో 0.8 మి.మీ చొప్పున వర్షం పడింది.

జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారిగా రవి



నరసరావుపేట: పల్నాడు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిగా డాక్టర్ బి.రవి సోమవారం ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. ఏలూరు జిల్లాలో వైద్య ఆరోగ్యశాఖ అధికారిగా పనిచేస్తూ బదిలీపై జిల్లాకు వచ్చారు. ఇక్కడ డీఎంహెచ్‌వోగా పనిచేస్తున్న డాక్టర్ జి.శోభారాణి బదిలీపై సివిల్ సర్జన్‌గా రీజినల్ లేబొరేటరీ గుంటూరు మెడికల్ కాలేజీకి బదిలీ అయ్యారు.

8వ తేదీన జాబ్ మేళా

గుంటూరు వెస్ట్: ఈనెల 8వ తేదీ ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 వరకు మెగా జాబ్ మేళా నిర్వహిస్తారని జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి తెలిపారు. దీనికి సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ప్రియదర్శిని ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, మేనేజ్‌మెంట్ కాలేజీ, ప్రత్తిపాడులో మేళా జరుగుతుందన్నారు. ఈ జాబ్ మేళాలో 24 కంపెనీలు పాల్గొంటాయన్నారు. 18–45 సంవత్సరాల మధ్య వయస్సున్న వారు అర్హులన్నారు. విద్యార్హతను బట్టి జీతం రూ.8,000 నుంచి 40 వేల వరకు ఉంటుందన్నారు.

నిమ్మకాయల ధరలు

తెనాలిటౌన్: గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్ యార్డులో సోమవారం క్వింటా నిమ్మకాయల కనిష్ట ధర రూ.4,000, గరిష్ట ధర రూ.7,000, మోడల్ ధర రూ.5,800 వరకు పలికింది.

దసరా సందడి షురూ..!

విజయవాడ: శ్రీదుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానంలో అక్టోబర్ 15వ తేదీ నుంచి 23వ తేదీ వరకు నిర్వహించే దసరా ఉత్సవాలకు అవసరమైన పనులు ప్రారంభమయ్యాయి. ఉత్సవాల ఏర్పాట్లు, భక్తుల రద్దీ నేపథ్యంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు వంటి అంశాలపై ఈ నెల 8వ తేదీన కో ఆర్డినేషన్ సమావేశం జరగనుంది. ఈ సమావేశంలో ఉత్సవాలకు ఏయే శాఖలు ఏయే ఏర్పాట్లు చేయాలనే అంశంతో పాటు ఆయా శాఖల మధ్య సమన్వయంపై చర్చిస్తారు. ఆయా శాఖల ముఖ్య అధికారులకు దుర్గగుడి దేవస్థాన అధికారులు ఇప్పటికే సమాచారం అందించారు. ఇక దసరా ఉత్సవాలకు అవసరమైన పనులకు పాలక మండలి ఆమోదం తెలిపింది. దీంతో ఆయా పనులు టెండర్ల దశకు చేరుకోగా, నాలుగైదు రోజుల్లో తుది దశకు చేరుకునే అవకాశం ఉందని ఆలయ అధికారులు పేర్కొన్నారు. ఉత్సవాల నేపథ్యంలో అమ్మవారి సన్నిధిలో నిర్వహించే ప్రత్యేక పూజలు, సేవల వివరాలను దేవస్థానం రెండు రోజుల కిందట విడుదల చేసింది. అమ్మవారి ఆలయం పరిసరాలతోపాటు రాజగోపురాన్ని అందంగా ముస్తాబు చేసేందుకు అవసరమైన పెయింటింగ్ పనులు సోమవారం నుంచి ప్రారంభమయ్యాయి. రాజగోపురం వద్ద పెయింటింగ్ పనులను కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. ఈ ఏడాది దసరా ఉత్సవాల్లో క్యూలైన్లు, షామియానాలు, వాటర్ ప్రూఫ్ షెడ్లు, వీవీపీల వాహనాల ఏర్పాటుకు రూ. 3.34 కోట్ల అంచనాలతో పనులకు పాలక మండలి ఆమోదం తెలిపింది.

గిరిపుత్రుల జీవితాల్లో వెలుగులు



ఈ ఫొటోలో కనిపిస్తున్న ఈమె పేరు కొమరగిరి కోటేశ్వరమ్మ. పాతమల్లాయపాలెం. గతంలో అటవీ ప్రాంతంలో నివసిస్తూ కష్టాలు ఎదుర్కొన్నారు. గత పాలకులు ఇదిగో చేస్తాం.. చూస్తామని హామీ ఇచ్చారు. కానీ పట్టించుకోలేదు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చిన తరువాత అండగా నిలిచింది. 4 సెంట్ల ఇళ్ల స్థలంతో పాటు నిర్మాణానికి అవసరమైన ఆర్థిక సాయం అందించారు. ' అటవీ నుంచి బయటికి రావడం ఆనందంగా ఉంది. ఇల్లు నిర్మించుకున్నా. పని దొరుకుతోంది. మా బిడ్డలు చదువుకొంటున్నారు. సీఎం వైఎస్ జగన్‌కు రుణపడి ఉంటా' అని ఆనందం వ్యక్తం చేసింది.



జగనన్న కాలనీలో జోరుగా సాగుతున్న గృహనిర్మాణాలు

కొత్త మల్లాయ'పల్లె' దారి దీపం

- డ్రామోజీ పచ్చపైత్యం
- గిరిజనుల ఇళ్లు కొట్టి.. గ్రానైట్ కొల్లగొట్టి అంటూ తప్పుడు కథనం
- నలభై ఏళ్లుగా బల్లికురవ మండలం అటవీ ప్రాంతంలో గిరిజనులు
- 70 కుటుంబాలకు 4 సెంట్ల చొప్పున వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి కృష్ణచైతన్య అందజేత
- మరో 27 కుటుంబాలకు జగనన్న కాలనీలో ఇళ్లు
- తప్పుడు కథనంపై గిరిజనుల ఆగ్రహం

సాక్షి ప్రతినిధి, బాపట్ల: గిరిపుత్రులకు అటవీ ప్రాంతం ఆవాసం. నిత్యం బతుకు పోరాటమే. వసతులు లేవు. పనులు లేవు. రాత్రిపూట చీకటి. రాకపోకలు సాగించేందుకు దారిలేదు. దరిదాపుల్లో బస్సు సౌకర్యంలేదు. లోతట్టుప్రాంతం కావడంతో వర్షాకాలం నీటిలోనే జీవనం ఇదీ బాపట్ల జిల్లాలోని బల్లికురవ మండలం మల్లాయపల్లె గ్రామపంచాయతీలోని కొత్తమల్లాయపల్లె గిరిజన కాలనీ దుస్థితి.

దశ తిరిగింది ఇలా..

వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అధికారం చేపట్టగానే గిరిజన, వడ్డెరలకు మంచి రోజులొచ్చాయి. ఆ పార్టీ అద్దంకి నియోజకవర్గ ఇన్‌చార్జి, ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర శాప్‌నెట్ చైర్మన్ బాచిన కృష్ణచైతన్య, గిరిపుత్రుల బాధ్యత తీసుకున్నారు. అటవీ ప్రాంతం నుంచి బయటకు వచ్చేందుకు గిరిజనులను ఒప్పించారు. 70 కుటుంబాలకు లబ్ధి చేకూర్చారు. మల్లాయపల్లె–వేమవరం జంక్షన్‌కు సమీపంలో మూడు ఎకరాల స్థలంలో ప్రతి కుటుంబానికి 4 సెంట్ల స్థలం ఇచ్చారు. తానే స్వయంగా ఇళ్లు నిర్మించారు. వీరితో పాటు జగనన్న కాలనీలో మొదటి విడతలో 27 పక్కా గృహాలు మంజూరు చేసింది. ఇందులో 17 గృహాల నిర్మాణం పూర్తయి గృహప్రవేశం చేశారు. మిగిలిన నిర్మాణాలు వివిధ దశల్లో ఉన్నాయి.

ఉపాధికి కొరత లేదు..

గిరిజనులతో పాటు పది కుటుంబాల వడ్డెరలు అందరూ భవన నిర్మాణ కార్మికులే. స్థానికంగా పెద్ద ఎత్తున వెలసిన గ్రానైట్ పరిశ్రమలతోపాటు మార్టూరు, చిలుకలూరిపేట పట్టణాలు సమీపంలో ఉన్నా. అక్కడ వీరికి నిత్యం పనులు దొరుకుతున్నాయి. భార్యాభర్తలు పనికి వెళ్లి సాయంత్రానికి తిరిగి ఇళ్లకు చేరుకుంటున్నారు. దారి తెన్నూలేని అటవీప్రాంతం నుంచి బయట ప్రాంతానికి రావడంవల్లే సుఖంగా బతుకుతున్నామని గిరుజనులు చెబుతున్నారు. గత ప్రభుత్వంలో స్థానిక ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ సమీపంలోని అటవీ ప్రాంతాన్ని చూపి బయటకు వెళ్లమని చెప్పారని, పరిహారంకానీ , రోడ్డుమార్గాన ఇళ్లు చూపించలేదని వారు ఆరోపిస్తున్నారు.

ఎల్లో పత్రిక తప్పుడు కథనం....

గిరిజనుల ఇళ్లకొట్టి.. గ్రానైట్ కొల్లగొట్టి అనే శీర్షికతో ఈనాడు సోమవారం తప్పుడు కథనాన్ని వండివార్చింది. ఖనిజ సంపద ఉందని తెలిసి అధికార పార్టీ నేతలు మూడేళ్ల క్రితమే గిరిజనుల ఇళ్లు ఖాళీ చేయించారని, దీంతో ఎస్టీలు గూడు కోల్పోయారని రాశారు. టీడీపీ పాలనలో వారిని గాలికొదిలేసిన విషయాన్ని పచ్చ పత్రిక మరుగున పెట్టి అధికార పార్టీపై బురదజల్లే యత్నానికి దిగింది. అవాస్తవ కథనంతో విషం చిమ్మింది. టీడీపీ పాలనలో అద్దంకి ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ అక్కడ గ్రానైట్ ఉన్న విషయం గుర్తించి గిరిజన, వడ్డెరలను ఖాళీచేయమన్నారు. వారు పునరావాసం చూపించమనే సరికి పక్కనున్న అటవీప్రాంతంలోనే పాతిక మందికి షెడ్లు వేసి వెళ్లమన్నారు. 70 కుటుంబాల వారికి పాతికషెడ్లతో సరిపెట్టారు. పరిహారం , ఉపాధి సంగతి పట్టించుకోలేదు. దీంతో వారు అక్కడి నుంచి వెళ్లేందుకు ససేమిరా అన్నారు. ఎమ్మెల్యే ఒత్తిడి తెచ్చేసరికి గిరిజనులు న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి కాగానే నియోజకవర్గ ఇన్‌చార్జి కృష్ణచైతన్య గిరిజనులను అన్నిరకాలుగా ఆదుకున్నారు.

గిరిజనులు, వడ్డెరలకు న్యాయం చేశాం



మల్లాయపల్లె గిరిజన, వడ్డెర నిరుపేదలకు మా ప్రభుత్వంలోనే న్యాయం చేశాం. గత ప్రభుత్వంలో వారిని బెదిరించి ఎటువంటి సహాయం చేయకుండా వెళ్లగొట్టే ప్రయత్నం చేశారు. కానీ వారు ధైర్యంగా ఉండి ఎదిరించారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి కాగానే వారిని అన్నివిధాలా ఆదుకున్నాం. ఎల్లో పత్రిక తప్పుడు వార్తా కథనాన్ని రాయడం సిగ్గుచేటు.

– కృష్ణచైతన్య, రాష్ట్ర శాప్‌నెట్ చైర్మన్

మా కష్టాలు తీర్చారు



అడవిలో కష్టాలు పడుతున్న మమ్మల్ని ఈ ప్రభుత్వం అన్నివిధాలా ఆదుకుంది. వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి కృష్ణచైతన్య మా కుటుంబానికి 4 సెంట్లు స్థలం హైవేకు సమీపంలో ఇచ్చారు. సొంతంగా ఇల్లు కట్టించారు. ప్రభుత్వం పక్కా ఇళ్లు మంజూరు చేసింది. అందరం ఇళ్లు కట్టుకుంటున్నాం. గత ప్రభుత్వంలో మమ్మల్ని వెళ్లిపొమ్మని చెప్పారు తప్పా మాకు న్యాయం చేసేందుకు ప్రయత్నించలేదు.

– ఇంఢ్ల రామాంజనేయులు, పాత మల్లాయపల్లె కాలనీ

పోలీస్ స్టేషన్‌లో నిందితుడి ఆత్మహత్యా యత్నం

చీరాల: పట్టణంలోని ఒకటో పట్టణ పోలీస్ స్టేషన్‌లో పలు చోరీ కేసుల్లో నిందితుడు సోమవారం ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. వివరాలు.. ఈపురుపాలేనికి చెందిన ఇమ్మిడి వెంకటేశ్వర్లును వైర్ల దొంగతనం కేసులో ఇటీవల వన్‌టౌన్ పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు పంపించారు. కోర్టు అతడికి కండిషన్ బెయిలు మంజూరు చేసింది. ప్రతి సోమవారం పోలీసు స్టేషన్లో సంతకం చేయాల్సి ఉంది. సంతకం పెట్టేందుకు స్టేషన్‌కి వచ్చిన వెంకటేశ్వర్లును పోలీసులు విచారించారు. ఎనిమిది చోరీ కేసుల్లో నిందితుడి వేలిముద్రలు సరిపోలాయి. దీంతో వెంకటేశ్వర్లు ఒక్కసారిగా బ్లేడుతో గొంతు కోసుకొని ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నించాడు. విషయం గమనించిన పోలీసులు వెంటనే అతడిని చికిత్స నిమిత్తం ఒక ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. ప్రస్తుతం వెంకటేశ్వర్లు పరిస్థితి నిలకడగానే ఉంది. సీఐ మల్లికార్జునరావు మీడియాతో మాట్లాడుతూ చోరీ కేసులో కండిషన్ బెయిల్‌పై వచ్చిన నిందితుడిని మరికొన్ని కేసుల్లో వేలిముద్రలు పోలి ఉండటంపై విచారించినట్లు చెప్పారు. బెదిరించేందుకే తనతో తెచ్చుకున్న బ్లేడ్‌తో ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నించాడని తెలిపారు. నిందితుడికి ప్రాణాపాయం లేదని వైద్యులు తెలిపినట్లు చెప్పారు.

యార్డుకు 32,439 బస్తాల మిర్చి

కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు సోమవారం 32,439 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ–నామ్ విధానం ద్వారా 30,793 బస్తాలు అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్–5, 273, 341, 4884, సూపర్–10 రకాల మిర్చి సగటు ధర రూ.10,000 నుంచి రూ.23,500 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.9,500 నుంచి 26,000 వరకు లభించింది. ఏసీ కామన్ రకం క్వింటాలుకు రూ.10,000 నుంచి రూ.23,000 వరకు పలికింది. ఏసీ ప్రత్యేక రకాల మిర్చికి రూ.13,500 నుంచి 24,000 వరకు లభించింది.

గుండ్లకమ్మ పెండింగ్ పనులకు రూ.110 కోట్లు

- ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ
- అద్దంకిలో ట్రామా కేర్ సెంటర్
- నియోజకవర్గ అభివృద్ధిపై సమీక్ష సమావేశం



మాట్లాడుతున్న ఉప ముఖ్యమంత్రి సత్యనారాయణ

అద్దంకి: గుండ్లకమ్మ ప్రాజెక్టు ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీలో పెండింగ్ పనులు పూర్తి చేసేందుకు రూ.110 కోట్లతో ప్రభుత్వానికి ప్రతిపాదనలు అందజేయనున్నట్లు రాష్ట్ర ఉపముఖ్యమంత్రి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొట్టు సత్యనారాయణ తెలిపారు. మండలంలోని శింగరకొండలోని వేమారెడ్డి సేవాసమితి సత్రంలో నియోజకవర్గ అభివృద్ధిపై జిల్లా అధికారులతో సమీక్ష సమావేశం సోమవారం నిర్వహించారు. మంత్రి మాట్లాడుతూ నియోజకవర్గ ప్రజలకు అవసరమైన గృహాల మంజూరుకు ప్రతిపాదనలు తయారు చేయాలని ఆదేశించారు. అర్హులైన లబ్ధిదారులకు ఇప్పటికే ఓటీఎస్ కింద రిజిస్ట్రేషన్ చేయాలని అధికారులకు సూచించినట్లు చెప్పారు. జగనన్న కాలనీల్లో మౌలిక వసతులు కల్పించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. గృహ నిర్మాణానికి సంబంధించి 845 మందికి స్థలాలు ఇవ్వాల్సి ఉందని చెప్పారు. 90 రోజుల పథకంలో భాగంగా స్థలాల కోసం అర్జీలు దాఖలు చేసుకున్న అర్హులకు జగనన్న కాలనీలోని ఖాళీల్లో స్థలాలు కేటాయించనున్నట్లు వెల్లడించారు. అద్దంకికి అదనంగా ఇళ్లు ఇవ్వాలని గృహ నిర్మాణశాఖ మంత్రిని కోరతామని చెప్పారు. ఆర్‌డబ్ల్యూఎస్ పనులకు సంబంధించి గ్రామాల వారీగా టెండర్లు పిలుస్తామన్నారు. అగ్రిమెంట్ అయిన తరువాత వెనక్కు వెళ్లిన కాంట్రాక్టులను రద్దు చేయాలని చెప్పారు. నాలుగు పీహెచ్‌సీలు మంజూరు అయ్యాయని మరో రెండు ప్రోగ్రెస్‌లో ఉన్నట్లు చెప్పారు.

ట్రామా కేర్ సెంటర్‌కు ప్రతిపాదన..

అద్దంకి పట్టణం హైవేలకు దగ్గరలో ఉన్నందున ట్రామా కేర్ సెంటర్ ఏర్పాటు చేయాలని ప్రభుత్వానికి ప్రతిపాదన పంపుతామన్నారు. ఎంజీఎన్‌ఆర్‌ఈజీఎస్ ద్వారా 2021–22కి సంబంధించి బీటీ రోడ్లకు సీఆర్‌డీఏ ద్వారా అనుమతులు తీసుకోస్తామన్నారు. టిడ్కో ఇళ్లకు సంబంధించి 1,536 ఇల్లు మంజూరు కాగా, 960 మంది లబ్ధిదారులు ముందుకు వచ్చారన్నారు.

ఇంటింటికీ తాగునీరు..

జల్‌జీవన్ మిషన్ ద్వారా అద్దంకి పట్టణంలో త్వరలో ఇంటింటికీ తాగునీరు ఇవ్వనున్నట్లు ఉప ముఖ్యమంత్రి వెల్లడించారు. రాష్ట్రం అంతా ఇదే పద్ధతిలో తాగునీటిని ఇచ్చేందుకు ప్రభుత్వం చూస్తోందన్నారు. సాగర్‌లో నీరు లేనందున ఈ నెలాఖరుకు సాగునీటి విడుదలకు షెడ్యూల్ ప్రకటించనున్నట్లు చెప్పారు. ఎత్తిపోతల పథకం కింద, భూగర్భ జలాల ద్వారా పంటలు పండించే వారికి రైతు భరోసా ద్వారా విత్తనాలు ఎరువులు సిద్ధంగా ఉన్నాయని వివరించారు. నియోజకవర్గ అభివృద్ధి గురించి త్వరలో డీడీఆర్‌సీ సమావేశంలో చర్చించనున్నట్లు చెప్పారు. సమావేశంలో రాష్ట్ర శాప్‌నెట్ చైర్మన్ బాచిన కృష్ణచైతన్య, జాయింట్ కలెక్టర్ సిహెచ్ శ్రీధర్, వ్యవసాయశాఖ జేడీ అబ్దుల్ సత్తార్, పశు సంవర్ధకశాఖ జేడీ హనుమంతరావు, మత్స్య శాఖ జేడీ సురేశ్, జిలా విద్యా శాఖ అధికారి రామారావు, పౌరసరఫరాల శాఖ డీఏ శ్రీలక్ష్మి, డీఎస్‌ఓ విలియమ్స్ పాల్గొన్నారు.

స్పందన అర్జీలు పునరావృతం కాకుండా చర్యలు

- కలెక్టర్ రంజిత్‌బాషా
- స్పందనకు 80 అర్జీలు



అర్జీదారుల నుంచి వివరాలు స్వీకరిస్తున్న కలెక్టర్ రంజిత్‌బాషా, జేసీ శ్రీధర్

బాపట్ల అర్బన్: జగనన్నకు చెబుదాం పోర్టల్‌లో నమోదయ్యే అర్జీలు పునరావృతం కాకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లోని స్పందన సమావేశ మందిరంలో సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహించారు. స్పందనలో 80 అర్జీలు నమోదయ్యాయి. తన పరిధిలోని వాటిని తక్షణమే ఆయన పరిష్కరించారు. మరికొన్నింటిని పరిశీలించి, విచారణకు కలెక్టర్ ఆదేశించారు.

ప్రాధాన్య భవనాల నిర్మాణంలో పురోగతి..

ప్రభుత్వ ప్రాధాన్య భవనాల నిర్మాణంలో పురోగతి సాధించాలని కలెక్టర్ రంజిత్‌బాషా కోరారు. గ్రామ సచివాలయాలు, ఆర్‌బీకేలు, వైఎస్సార్ ఆరోగ్య కేంద్రాల నిర్మాణాలు పూర్తి చేయాల్సిన లక్ష్యం అక్టోబర్ ఒకటో తేదీ వరకు పొడిగించినట్లు తెలిపారు. వేగంగా నిర్మాణాలు పూర్తి చేయాలని చెప్పారు. ముఖ్యంగా వర్షాకాలం దృష్ట్యా గ్రామాలలో పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపట్టాలని కోరారు. మురుగు నీరు నిల్వ లేకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. తాగునీటి ట్యాంకులు శుభ్రపరచాలని, నిర్వహణపై మండల ప్రత్యేక అధికారులు పర్యవేక్షించాలని ఆదేశించారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చూడాలని, ప్రజలు జ్వరాల బారిన పడకుండా వైద్య అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. వైఎస్సార్ బీమా పథకం లబ్ధిదారులకు అధికంగా మేలు జరిగేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు.

హాస్టల్ విద్యార్థులకు రక్షిత తాగునీరు..

ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాలలోని విద్యార్థులకు రక్షిత తాగునీరు అందిస్తామని జిల్లా కలెక్టర్ రంజిత్ బాషా తెలిపారు. జగనన్న కాలనీలలో లబ్ధిదారులు నిర్మించుకుంటున్న గృహాల వద్ద ఇంకుడు గుంతలు నిర్మించాలని ఆదేశించారు. ఈ ప్రక్రియను నియోజకవర్గ, మండల స్థాయి ప్రత్యేక అధికారులు క్షేత్రస్థాయి పర్యటనకు వెళ్లినప్పుడు పరిశీలించాలని సూచించారు. జగనన్న కాలనీలలో భూమి చదును చేసే ప్రక్రియ వేగంగా పూర్తి చేయాలన్నారు. ఈ క్రమంలో ఇసుక అక్రమ తవ్వకాలు, రవాణా జరగకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. నాడు– నేడు పనులు 60 శాతం పూర్తి కాగా క్షేత్ర పర్యటనకు వెళ్లినప్పుడు అధికారులు పనుల పురోగతిని పర్యవేక్షించాలన్నారు. సమావేశంలో జిల్లా సంయుక్త కలెక్టర్ సిహెచ్.శ్రీధర్, డీఆర్‌ఓ కె.లక్ష్మీశివజ్యోతి పాల్గొన్నారు.

వ్యవసాయ విద్యార్థులకు డ్రోన్ పైలట్ శిక్షణ



బాపట్ల అర్బన్: ఆంధ్రప్రదేశ్ సెన్సార్స్ అండ్ స్మార్ట్ అప్లికేషన్స్ రీసెర్చ్ ఇన్ అగ్రికల్చర్(అప్సర) ప్రాజెక్ట్ ద్వారా వ్యవసాయ విద్యార్థులకు లాంలోని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానంలో డ్రోన్ పైలట్ శిక్షణ ఇవ్వనున్నట్లు వ్యవసాయ కళాశాల ఇన్‌చార్జి అసోసియేట్ డీన్ డాక్టర్ బి.విజయాభినందన అన్నారు. రైతులు, ఇతర వినియోగదారులకు అవసరమైన ప్రపంచ స్థాయి, అత్యంత నైపుణ్యం కలిగిన వ్యవసాయ డ్రోన్ పైలట్లను ఉత్పత్తి చేయడం ముఖ్య ఉద్దేశంగా ఈ శిక్షణ ఏర్పాటు చేయబడిందన్నారు. అందుకు వ్యవసాయ కళాశాలకు చెందిన ఏ సుష్మ, కె. శ్వేత, వృతి హెచ్.బి., పి.హనిశ్రీ, కె.జె.ఐడా, ఏ పవన్ సాయి మోహిత్, రిగ్గిన్ యంగ్మో, ప్రిస్కిల్లా, కె.సాయి కిరణ్, టి.కృష్ణ వంశీ ఎంపికైనట్లు చెప్పారు. పూర్తి మెరిట్ ఆధారంగా విద్యార్థులను ఈ శిక్షణకు ఎంపికజేయడం జరిగిందన్నారు. వీరికి శిక్షణ మంగళవారం నుంచి 16వ తేదీ వరకు 12 రోజుల పాటు ఉంటుందన్నారు. డ్రోన్ ద్వారా విత్తనాలు చల్లుడం, ఎరువులు, పురుగులు, తెగుళ్ల మందులు చల్లడంలో శిక్షణ ఇవ్వబడుతుందని వివరించారు. తక్కువ సమయంలో ఎక్కువ భూమిని సాగులోకి తెచ్చుకోవడానికి ఈ విధానం ఉపయోగపడుతుందని వివరించారు. కార్యక్రమంలో ఐడీపీ, ఎన్ఏహెచ్ఈపీ కో ఆర్డినేటర్లు డాక్టర్ కె.చంద్రశేఖర్, డాక్టర్ వి.సీతారాంబాబు, డాక్టర్ బి.రత్నకుమారి పాల్గొన్నారు.

డీలర్లు అక్రమాలకు పాల్పడితే క్రిమినల్ కేసులు

డీఎస్‌ఓ విలియమ్స్



ఎంఎల్ఎస్ పాయింట్ వద్ద డెప్యూటీ తహసీల్దార్‌తో మాట్లాడుతున్న డీఎస్‌ఓ విలియమ్స్

చీరాల: రేషన్ డీలర్లు అక్రమాలకు పాల్పడితే సాధారణంగా పెట్టే 6–ఏతో పాటు క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని డీఎస్‌ఓ విలియమ్స్ హెచ్చరించారు. దేశాయిపేటలోని ఎంఎల్ఎస్ పాయింట్‌ను సోమవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డీలర్ల సమావేశంలో మాట్లాడారు. చీరాల ప్రాంతంలో రేషన్ బియ్యం అక్రమంగా రవాణాలో కేసులు ఎక్కువగా నమోదవుతున్నాయని చెప్పారు. అందులో డీలర్ల పాత్ర కూడా ప్రధానంగా ఉందని తమ దృష్టికి వచ్చిందని పేర్కొన్నారు. అధికారులు నిత్యం అక్రమ రవాణా చేస్తున్న వారిపై దాడులు చేసి రేషన్ బియ్యాన్ని, వాహనంతో పాటు సీజ్ చేస్తున్నామన్నారు. చాలామంది డీలర్లపై 6–ఏ కేసులు అధికంగా ఉండటం వల్ల ఈనెలలో వారికి బియ్యం కేటాయింపులు చేయలేదని వివరించారు. దీని వలన కార్డుదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అందుకు కారణం డీలర్లే అన్నారు. ప్రభుత్వం రేషన్ బియ్యాన్ని ప్రతి ఇంటికి సరఫరా చేసి పేదలను ఆదుకోవాలని చూస్తుంటే కొందరి కారణంగా కార్డుదారులు ఇబ్బందులకు గురవుతున్నారని వివరించారు. డెప్యూటీ తహసీల్దార్ ఓంకార్, శరత్, మాధవి పాల్గొన్నారు.

షూటింగ్ బాల్ జిల్లాస్థాయి జట్ల ఎంపిక



రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులు

మార్టూరు: మార్టూరు వివేకానంద నెక్స్ జెన్ పాఠశాల ఆవరణలో సోమవారం జిల్లా స్థాయి షూటింగ్ బాల్ బాల, బాలికల జట్ల ఎంపిక చేశారు. షూటింగ్ బాల్ సంఘం బాపట్ల జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బాబూరావు, సురేంద్ర ఆధ్వర్యంలో నిర్వహించిన ఎంపిక పోటీలో 14 మంది బాలికలు, 14 మంది బాలురుతో రెండు జట్లను ఎంపిక చేశారు. ఎంపికైన రెండు జట్లు ఈనెల 8,9,10 తేదీల్లో నెల్లూరు జిల్లా కావలి పట్టణంలో నిర్వహించే రాష్ట్రస్థాయి షూటింగ్ బాల్ పోటీల్లో పాల్గొంటారని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ వేలూరి కృష్ణమూర్తి, ప్రిన్సిపాల్ అక్కిశెట్టి, పీఈటీ హరిత పాల్గొన్నారు.

ఉత్తమ ప్రతిభకు పట్టం

- జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు 19 మంది ఎంపిక
- ఉపాధ్యాయ దినోత్సవంలో ప్రదానం
- హాజరు కానున్న జిల్లా కలెక్టర్ రంజిత్‌బాషా

బాపట్ల అర్బన్: ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని విద్యాశాఖ జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులను ప్రకటించింది. బాపట్ల జిల్లాలో మొత్తం 19 మందిని పురస్కారాలకు ఎంపిక చేసింది. నేడు బాపట్ల పట్టణంలోని ఎంఎస్ఆర్ కల్యాణ మండపంలో బాపట్ల జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా, జాయింట్ కలెక్టర్ శ్రీధర్ చేతుల మీదుగా అవార్డులుప్రదానం చేయనున్నారు.

స్కూల్ అసిస్టెంట్ విభాగంలో..

పి.సంధ్యారాణి, జెడ్పీహెచ్ఎస్, చిన్నమట్లపూడి, నగరం మండలం. కల్వ సోమశేఖర్, బోదవాడ జే పంగులూరు మండలం. కె.మోహన అంజలి, మక్కినవారిపాలెం, సంతమాగులూరు మండలం. దాసరి సరళ కుమారి, ఈపురుపాలెం గరల్స్ స్కూల్, చీరాల మండలం. ఎస్.ఆదాం, కొణిదెల, బల్లికురవ మండలం, ఎం.నాగిరెడ్డి, పొన్నూరు, యద్దనపూడి మండలం. రాజ్‌కుమార్, యద్దనపూడి మండలం. మూలబంటి ప్రభు, కుంకలమర్రు, కారంచేడు మండలం. పి.జీనస్, జెడ్పీహెచ్, గుళ్లపల్లి, చెరుకుపల్లి మండలం. టి.వెంకటేశ్వర్లు, మున్సిపల్ హైస్కూల్, బాపట్ల. ఎస్ రోజ్ హెల్మ, జెడ్పీ గరల్స్ హైస్కూల్ ఈపురుపాలెం, చీరాల.

ఎస్‌జీటీ విభాగంలో...

పి.రమేష్ బాబు, వీఎస్ గవర్నమెంట్ ప్రైమరీ స్కూల్ వెనిగళ్లవారిపాలెం, నగరం మండలం. కేవీఎస్ఎన్ కోటేశ్వరరావు, ఎంపీపీ ఎస్ సెవెంత్ వార్డ్, మోదుకూరు, చుండూరు మండలం. ఎం.కోటేశ్వరరావు, ఎంపీయూపీఎస్, ఆరేపల్లి, చెరుకుపల్లి మండలం. కరిముల్లా బేగ్, ఎంపీపీఎస్ కొప్పువారిపాలెం, నిజాంపట్నం. డి.ఆదినారాయణ, ఎంపీపీఎస్ ముల్పూరు, అమృతలూరు మండలం. జానీ మహమ్మద్, ఎంపీయూపీఎస్, కట్టవా, నగరం మండలం. చలపతిరావు, జొన్నవారిపాలెం, రేపల్లె. ముప్పవరపు మధుమతి, ఏపీ మోడల్ స్కూల్, చీరాల మండలం.

ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులతో ఆరోగ్యభాగ్యం

- కలెక్టరేట్‌లో స్టాల్‌ను సందర్శించిన జిల్లా కలెక్టర్, జేసీ
- అత్తలూరు ఆర్గానిక్స్ రైతు ఉత్పత్తిదారుల సంఘానికి జైవిక్ అవార్డు
- ఢిల్లీలో స్వీకరించనున్న జిల్లా కలెక్టర్


ప్రకృతి వ్యవసాయంతో పండించిన ఉత్పత్తులను చూపిస్తున్న కలెక్టర్ శివశంకర్, ప్రాజెక్ట్ మేనేజర్ అమలకుమారి

నరసరావుపేట: ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులను అధికారులు, సామాన్య ప్రజలు అందరూ సద్వినియోగం చేసుకుని ఆరోగ్యాన్ని పెంపొందించుకోవాలని జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్, జాయింట్ కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాదు కోరారు. సోమవారం కలెక్టరేట్ ఆవరణంలో ఏర్పాటు చేసిన ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల స్టాల్‌ను వారు సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతివారం ప్రకృతి వ్యవసాయ విభాగం జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ కె.అమలకుమారి ఆధ్వర్యంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో పురుగుమందులు, రసాయన అవశేషాలు లేకుండా కేవలం ఆవు పేడ, ఘనజీవామృతం, జీవామృతం, కషాయాలు ఉపయోగించి పండించిన ఆరోగ్యకరమైన కూరగాయలు, ఆకు కూరలు, పండ్లు, బియ్యం, కారం, పసుపు మొదలైన ఉత్పత్తులను అందుబాటులో ఉంచడం అభినందనీయమన్నారు. ఈ విధానం అవలంభిస్తూ జిల్లాలోని అత్తలూరు గ్రామంలో అత్తలూరు ఆర్గానిక్ ఫార్మర్స్ ప్రొడ్యూసర్స్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో గ్రామంలో ఉన్న రైతులందరూ ప్రకృతి వ్యవసాయం ద్వారా పంటలు పండిస్తున్నారన్నారు. వారికి కావలసిన ఘన జీవామృతం, కషాయాలు వంటి వాటిని అందిస్తూ పండించిన వ్యవసాయ ఉత్పత్తులను తిరిగి అత్తలూరు ఆర్గానిక్ రైతు ఉత్పత్తిదారుల సంఘం ద్వారా కొనుగోలు చేస్తున్నారన్నారు. వారే మార్కెటింగ్ అవుట్‌లెట్స్ ఓపెన్ చేసి వినియోగదారులకు వ్యవసాయ సహజ ఉత్పత్తులు ఎప్పటికప్పుడు అందుబాటులో ఉంచుతున్నారన్నారు. అత్తలూరు ఆర్గానిక్ రైతు ఉత్పత్తిదారుల సంఘానికి జైవిక్ జాతీయ అవార్డు–2023 రావటం పల్నాడు జిల్లాకే గర్వకారణమన్నారు. ఈ అవార్డును ఈనెల 7వ తేదీన న్యూఢిల్లీలో జరిగే జాతీయ సమావేశంలో కలెక్టర్ అందుకోనున్నట్లు ప్రాజెక్ట్ మేనేజర్ అమలకుమారి పేర్కొన్నారు.

వెనుకబడిన మండలాలపై సమీక్ష..

నరసరావుపేట: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ప్రాధాన్యత అంశాలపై వెనుకబడి ఉన్న మండలాలను సంక్షేమ, అభివృద్ధి పథకాల అమలులో ముందంజలో నిలపాలని జిల్లా కలెక్టర్ శివశంకర్ లోతేటి పేర్కొన్నారు. సోమవారం స్థానిక కలెక్టర్ కార్యాలయంలోని ఎస్‌ఆర్ శంకరన్ వీడియో కాన్ఫరెన్స్ హాలు నుంచి మండల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. జగనన్నకు చెబుదాం, 90 రోజుల పనిదినాల కల్పన, రీ–ఓపెన్ కేసులు, వైఎస్సార్ ఆరోగ్యశ్రీ అమలు, ఆరోగ్య శాఖకు సంబంధించి ప్రాథమిక, కమ్యూనిటీ హెల్త్ సెంటర్లలో డెలివరీ శాతం పెంచడం, దానికి తగిన యాక్షన్ ప్లాన్ ద్వారా పురోగతిలోకి తీసుకురావాల్సి ఉంటుందని ఆయన తెలిపారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, కమ్యూనిటీ హెల్త్ సెంటర్లలో వైఎస్సార్ ఆరోగ్యశ్రీ రిజిస్ట్రేషన్ సంఖ్య పెంచే విధంగా ఆయన పలు సూచనలు చేశారు. పాఠశాలలలో మధ్యాహ్న భోజనాన్ని పకడ్బందీగా మెనూ ప్రకారం అమలు చేయాలని, విద్యార్థులు మరింతమందికి భోజన వసతి ఏర్పాటు చేసేలా చూడాలన్నారు. నాడు–నేడు కార్యక్రమం కింద అభివృద్ధి చేస్తున్న రైతు భరోసా కేంద్రాలు, హెల్త్ క్లినిక్‌లు, పాఠశాలల అభివృద్ధి, అంగన్‌వాడీ కేంద్రాలపై సమీక్షించారు. పంచాయతీరాజ్ శాఖ ద్వారా రూరల్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ డెవలెప్‌మెంట్ ద్వారా సచివాలయాల ఏర్పాటు పురోగతిలోకి తీసుకురావాలని మండల అధికారులను ఆదేశించారు. ట్రైనీ కలెక్టర్ కల్పశ్రీ, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

మృతుల ఓట్లు వెంటనే తొలగించండి..

గుంటూరు వెస్ట్: స్పెషల్ సమ్మరీ రివిజన్ 2024లో భాగంగా ఇంటింటి సర్వేలో మరణించిన వారి ఓట్లు గుర్తించిన వెంటనే తొలగించాలని గుంటూరు జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాలరెడ్డి తెలిపారు. సోమవారం రాష్ట్ర సచివాలయం నుంచి రాష్ట్ర చీఫ్ ఎలక్టోరల్ అధికారి ముఖేష్ కుమార్ మీనా నిర్వహించిన వీడియో సమావేశంలో స్థానిక కలెక్టరేట్ నుంచి కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా మరణించిన వారి ఓట్లు ఓటర్ల లిస్టులో కొనసాగుతున్నాయన్నారు. ఈఆర్వో, ఏఈఆర్వో, నూతన ఓటర్లకు సంబంధించి 6, 7, 8 ఫారమ్స్, వెరిఫికేషన్ తదితర అంశాలను అధికారులు పర్యవేక్షించాలన్నారు. ఓటరు కార్డు వెరిఫికేషన్‌కు వెళ్లినప్పుడు బీఎల్వోలు ఆ ఇంటిలోని కుటుంబ సభ్యులకు ఓటరు కార్డులకు సంబంధించి అన్ని విషయాలను నిర్దేశించిన మార్గదర్శకాల ప్రకారం నమోదు చేయాలన్నారు.

త్వరలో ఎంసీహెచ్ బిల్డింగ్ పూర్తిచేస్తాం


పనులు పరిశీలిస్తున్న డాక్టర్ సాగిరెడ్డి

గుంటూరు మెడికల్: గుంటూరు జీజీహెచ్‌లో పూర్వ వైద్య విద్యార్థుల సహకారంతో (జింఖానా) రూ. 86 కోట్లతో నిర్మాణం జరుగుతున్న మాతశిశు సంరక్షణ కేంద్రాన్ని త్వరితగతిన పూర్తి చేస్తామని జింఖానా మాజీ ప్రెసిడెంట్, ఎంసీహెచ్ భవన కమిటీ చైర్మన్ డాక్టర్ బాబు రెడ్డి సాగిరెడ్డి అన్నారు. సోమవారం ఆయన జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్ కుమార్‌తో కలిసి భవన నిర్మాణ పనులను పరిశీలించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ 2024 ఏప్రిల్ నాటికి ఎంసీహెచ్ నిర్మాణం పూర్తి చేస్తామన్నారు. ప్రస్తుతం మూడు అంతస్తుల నిర్మాణం జరిగిందని, ఇంకా నాలుగు అంతస్తుల నిర్మాణ పనులు జరగాల్సి ఉందన్నారు. గుంటూరు వైద్య కళాశాలలో చదువుకుని అమెరికాలో స్థిరపడిన అనేక మంది పూర్వ విద్యార్థులు మాతృసంస్థకు సహాయం చేయాలనీ రూ. 86 కోట్లతో ఎంసీహెచ్ నిర్మాణం చేపట్టామన్నారు. తాము చేస్తున్న మంచి కార్యానికి స్థానికంగా ఉండే దాతలు ఎవరైనా ముందుకు వస్తే చాలా సంతోషంగా, తమకు సపోర్టుగా ఉంటుందన్నారు. సాయం చేసే దాతల పేర్లతో భవన నిర్మాణంలో గదులకు శిలాఫలకాలు ఏర్పాటు చేస్తామన్నారు. సూపరింటెండెంట్ డాక్టర్ కిరణ్ కుమార్ మాట్లాడుతూ వైద్య ఆరోగ్య శాఖ విభాగం స్పెషల్ చీఫ్ సెక్రటరీ యం.టి.కృష్ణ బాబు, ఏపీ ఎం ఎస్ ఐ డి సి యండి మురళీధర్ రెడ్డి, జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాలరెడ్డిలను సోమవారం కలిసి పలు విషయాలపై చర్చించామన్నారు. ఎంసీహెచ్ భవన నిర్మాణం పూర్తయిన తరువాత అవసరమైన కొత్త పరికరాలను ప్రభుత్వం తరుపున అందించేలా చర్యలు తీసుకుంటామని కృష్ణబాబు హామీ ఇచ్చారన్నారు. అంతేకాకుండా భవన నిర్మాణ మెయిటెనెన్స్‌ను సైతం జింఖానా సభ్యులు కోరితే వారికే అప్పగిస్తామని కృష్ణబాబు హామీ ఇచ్చినట్లు వెల్లడించారు. జీజీహెచ్‌కు సిటీస్కాన్ వైద్య పరికరం అవశ్యకత గురించి తెలియజేయడంతో తక్షణమే మంజూరు చేస్తూ ఆదేశాలు ఇచ్చారని ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో జింఖానా స్థానిక కో ఆర్డినేటర్ డాక్టర్ బాలభాస్కరరావు, డాక్టర్ హనుమంతరావు, గైనిక్, పీడియాట్రిక్, పీడియాట్రిక్ సర్జరీ వైద్యులు పాల్గొన్నారు.

స్పందన అర్జీలకు తక్షణమే పరిష్కారం

జిల్లా ఎస్పీ వకుల్‌జిందాల్


బాధితుల సమస్యలను తెలుసుకుంటున్న జిల్లా ఎస్పీ వకుల్‌జిందాల్

బాపట్ల టౌన్: స్పందన అర్జీలను తక్షణమే పరిష్కరించాలని జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ ఆదేశించారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో స్పందన కార్యక్రమం సోమవారం నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి 57 మంది బాధితులు హాజరై తమ సమస్యలను నేరుగా ఎస్పీకు విన్నవించుకున్నారు. బాధితుల సమస్యలను క్షుణ్ణంగా పరిశీలించిన ఎస్పీ వకుల్‌జిందాల్, అడిషనల్ ఎస్పీ పి.మహేష్ వెంటనే సంబంధిత సీఐ, ఎస్ఐలతో మాట్లాడి సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ఆదేశించారు.

వృద్ధాప్యంలో నన్ను పట్టించుకోవడం లేదు

నాకు ముగ్గురు సంతానం. నా భర్త పిల్లలు చిన్నతనంలోనే చనిపోయారు. అప్పటి నుంచి వీరందరిని సాకి పెళ్లి చేశా. ఉన్న ఆస్తిని ముగ్గురుకి సమానంగా పంపిణీ చేశా. నా పెద్ద కుమారుడు, రెండో కూమారుడు చనిపోయారు. వారి బిడ్డలు ఆస్తి అయితే పంచుకున్నారు కానీ, నన్ను పట్టించుకోవడం లేదు. మూడో కొడుకు ఒక్కడే చూస్తున్నారు. మిగిలిన వాళ్లు పట్టించుకోవడం లేదు. ఇదేమని అడిగితే చంపుతామంటున్నారు. – సమ్మెట మాణిక్యం, కొల్లూరు

ఇంట్లో బంగారం ఎత్తుకెళ్లారు

గత నెల 11వ తేదీన మా అమ్మ, జె.పంగులూరులో చనిపోయింది. ఆ సమయంలో జె.పంగులూరు గ్రామానికి సయ్యద్ బాబు, సయ్యద్ బాషా మా ఇంట్లో చొరబడి మా ఇంట్లోని దస్తావేజులు, బంగారం, రూ.47 వేలు తీసుకెళ్లారు. గతనెల 15న కారంచేడులో ఫిర్యాదు చేశా. 21న స్పందనలో అర్జీ పెట్టాను. దీనిపై ఇంకొల్లు సీఐ పిలిపించి వెంటనే దస్తావేజులు, బంగారం తిరిగి ఇవ్వాలని కోరారు. ఇప్పటి వరకు సయ్యద్‌బాబు, బాషాలు మా దస్తావేజులు, బంగారం, నగదు ఇవ్వలేదు. న్యాయం చేయాలి. – షేక్ షర్మిలాబీ, కారంచేడు

భర్త వేధింపులు భరించలేకపోతున్నా

విశాఖపట్నానికి చెందిన తోట మల్లికార్జున రావుతో నాకు 2019 జూలై 4న వివాహం జరిగింది. నా పెళ్లి సమయంలో నా కుటుంబ సభ్యులు రూ.10 లక్షల నగదు, బంగారం వస్తువులు ఇచ్చారు. అయినప్పటికీ నిత్యం అధిక నగదు తీసుకురమ్మంటూ నా భర్త మల్లికార్జున, మా ఆడపడుచు ప్రశాంతి, ఆడ పడుచు భర్త హరికిషోర్ నిత్యం వేధింపులకు గురిచేస్తున్నారు. వారి వలన నేను శారీరకంగా, మానసికంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నా. న్యాయం చేయాలి. – తోట అనూష, బాపట్ల

రేపు 'బజరంగ్' క్యాన్సర్ వైద్య శిబిరం

- 'జగన్నామ సంక్షేమ సంవత్సరంలో ప్రతి మహిళా సురక్షితం
- బజరంగ్ ఫౌండేషన్ సీఈవో అంబటి మురళీకృష్ణ


పోస్టర్‌ను ఆవిష్కరించిన అంబటి మురళీకృష్ణ

పొన్నూరు: మహిళలకు క్యాన్సర్ మహమ్మారి నుంచి రక్షణ కల్పించే సదుద్దేశంతో 'జగన్నామ సంక్షేమ సంవత్సరంలో ప్రతి మహిళా సురక్షితం' అనే నినాదంతో వైద్య పరీక్షా శిబిరాన్ని బజరంగ్ చేపట్టిందని బజరంగ్ ఫౌండేషన్ సీఈవో అంబటి మురళీకృష్ణ తెలిపారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఇంటికే ఆరోగ్యం–జగనన్నతో సాకారం, ఆరోగ్యశ్రీతో ఆయుష్మాన్ భవ అంటూ తాము ప్రచారం చేస్తున్నట్లు తెలిపారు. దీనిలో భాగంగా పొన్నూరు మండలం మామిళ్ళపల్లి గ్రామంలో బుధవారం ఏర్పాటు చేసిన వైద్య శిబిరంలో మహిళలకు రొమ్ము, గర్భాశయ క్యాన్సర్లను గుర్తించే వైద్య పరీక్షలను గుంటూరు ఒమేగా హాస్పిటల్ సహకారంతో మహిళా వైద్యుల ఆధ్వర్యంలో చేస్తున్నట్లు తెలిపారు. ప్రతి ఇంటికీ ఆరోగ్యం జగనన్న 'ఆరోగ్యశ్రీ' తోనే సాధ్యమని, వైద్య–వ్యాధి నిర్ధారణ జరిగిన వారికి తదుపరి వైద్య సేవలకు బజరంగ్ ఫౌండేషన్ ఏర్పాట్లు చేస్తోందని వివరించారు. గ్రామాలలో మొట్టమొదటి సారిగా అత్యాధునిక పద్ధతులో పాప్ స్మియర్ పరీక్షలు జరుగుతాయన్నారు. మామిళ్లపల్లి గ్రామంలో మహిళలకు అవగాహన కోసం గడప గడపకూ స్వయంగా వెళ్లి అంబటి మురళీకృష్ణ ప్రచారం నిర్వహించారు.

గుండె సమస్యలపై అప్రమత్తత అవసరం

ప్రజలు గుండె సమస్యల పట్ల అత్యంత అప్రమత్తంగా ఉండాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉన్నదని మురళీకృష్ణ అన్నారు. దండమూడి గ్రామంలో కొద్ది రోజుల కిందట ఏర్పాటు చేసిన గుండె సంబంధిత వైద్య శిబిరంలో యాంజియోగ్రామ్ పరీక్ష అవసరమైన 24 మందిలో 12 మందిని ప్రత్యేక బస్సు ద్వారా విజయవాడ మెడ్‌స్టార్ ఆసుపత్రికి సోమవారం తరలించారు. అత్యాధునిక వైద్య పరికరాలతో నిర్వహించిన యాంజియోగ్రామ్ పరీక్షలో 8 మందికి ఆరోగ్య స్థితి మెరుగ్గానే ఉండగా, ఇద్దరికి శస్త్ర చికిత్స ఆవశ్యకత, ఇద్దరికి స్టంట్ వేయాల్సిన ఆవశ్యకత ఉన్నట్లు వైద్యులు నిర్ధారించారు. మెడ్‌స్టార్ ఆసుపత్రిలో పేషెంట్లను అంబటి మురళీకృష్ణ పరామర్శించారు. జగన్నామ సంక్షేమ సంవత్సరంలో భాగంగా 'మీ గుండె పదిలం' నినాదంతో చేపట్టిన వైద్య శిబిరాలు ఎంతో ప్రయోజనకరంగా ఉన్నాయని తెలిపారు.

బాధితులకు ఆరోగ్యశ్రీ పథకం వర్తింపజేస్తూ, వేగవంతంగా సకాలంలో వైద్య సహాయం అందేందుకు తోడ్పడుతున్న ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి సర్కారు స్ఫూర్తితో ఈ కార్యక్రమాన్ని మరిన్ని గ్రామాలకు తీసుకువెళతామన్నారు. అనంతరం గుండె పదిలం పోస్టర్‌ను ఆవిష్కరించారు.

జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడిగా ప్రభూజీ



కుంకలమర్రు(కారంచేడు): జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడిగా మండలంలోని కుంకలమర్రు ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు మొలబంటి ప్రభూజీ ఎంపికయ్యారు. ఈమేరకు జిల్లా విద్యాశాఖ నుంచి సమాచారం అందింది. సెంటా(సీఈఎస్‌టీఏ) ఇటీవల నిర్వహించిన సర్వే ప్రకారం రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన ఇంగ్లిష్ మీడియం బోధనలో విద్యార్థులకు అర్థమయ్యేలా బోధించడంతో పాటు, ఉపాధ్యాయులు ఎలాంటి టీచింగ్ సామర్థ్యం కలిగి ఉన్నారని ఆన్‌లైన్ పరీక్ష నిర్వహించింది. వీటి ఆధారంగా గణితం బోధనలో అవార్డు దక్కింది. జిల్లా వ్యాప్తంగా ఇంగ్లిష్, లెక్కలు, సైన్స్, సోషల్ సబ్జెక్టులపై సర్వే నిర్వహించారు. సబ్జెక్టులో ఒక్కొక్కరికి మాత్రమే ఈ అవార్డు ఇస్తున్నారు. విషయం తెలిసిన ఎంఈఓలు ఎంవీ సత్యనారాయణ, మొలబంటి వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు ప్రభూజీని అభినందించారు. మంగళవారం బాపట్లలో నిర్వహించనున్న ఉపాధ్యాయ దినోత్సవంలో కలెక్టర్ పి.రంజిత్‌బాషా నుంచి అవార్డు అందుకోనున్నారు.

దూరవిద్య సప్లిమెంటరీ పరీక్ష ఫీజు వివరాలు

డీఈఓ శామ్యూల్


నరసరావుపేట ఈస్ట్: ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్యాపీఠం ఉత్తర్వుల మేరకు 2024 ఏప్రిల్‌లో జరగనున్న పదవ తరగతి, ఇంటర్మీడియెట్ దూరవిద్య సప్లిమెంటరీ పరీక్షల హాజరయ్యే అభ్యర్థులు ఈనెల 5వ తేదీ నుంచి అక్టోబర్ 15వ తేదీవరకు ఎటువంటి అపరాధ రుసుం లేకుండా పరీక్ష ఫీజు చెల్లించవచ్చని జిల్లా విద్యాశాఖాధికారి కె.శామ్యూల్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. గత విద్యా సంవత్సరంలో ప్రవేశం పొంది పరీక్షకు హాజరై ఫెయిలైన అభ్యర్థులు, పరీక్షకు హాజరుకాని అభ్యర్థులు అర్హులని తెలిపారు. పదవ తరగతిలో థియరీ ఒక సబ్జెక్టుకు రూ.100, ఇంటర్మీడియెట్ థియరీ సబ్జెక్టుకు రూ.150, ప్రాక్టికల్ ఒక సబ్జెక్టుకు రూ.100 చెల్లించాలని తెలిపారు. అలాగే ఇంటర్మీడియెట్ ఇంప్రూవ్‌మెంట్ కోసం థియరీ ఒక సబ్జెక్టుకు రూ.250, ప్రాక్టికల్ రూ.100 చెల్లించాలన్నారు. పరీక్ష ఫీజును ఏ.పి.టి ఆన్‌లైన్/ పేమెంట్ గేట్ వే ద్వారా మాత్రమే చెల్లించాలనీ, డి.డి, చలానాలు స్వీకరించబడవని స్పష్టం చేశారు. జిల్లా పరిధిలో ఏఐ కో–ఆర్డినేటర్స్‌గా పనిచేస్తున్న ప్రధానోపాధ్యాయులు, జూనియర్ కళాశాలల ప్రిన్సిపాల్స్, ఉప తనిఖీ అధికారులు తమ పరిధిలోని సప్లిమెంటరీ అభ్యర్థుల నుంచి ఫీజులు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

డివైడర్‌ను ఢీకొని కారు బోల్తా

నలుగురికి స్వల్పగాయాలు

ఫిరంగిపురం: ప్రమాదవశాత్తు డివైడర్‌ను కారు ఢీకొని బోల్తాపడిన సంఘటన మండలకేంద్రంలో ఆదివారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం గుంటూరు నుంచి వినుకొండ వైపునకు వెళుతున్న కారు ఫిరంగిపురంలోని అంబేడ్కర్ సెంటర్ వద్ద రోడ్డు మధ్యలో ఉన్న డివైడర్‌ను ఢీకొంది. ఈసంఘటనలో కారులో ప్రయాణిస్తున్న నలుగురు వ్యక్తులకు స్వల్పగాయాలయ్యాయి. సంఘటన స్థలానికి చేరుకున్న ఎస్ఐ చల్లా కిషోర్ తన సిబ్బందితో కారులోపల వారిని బయటకు తీయించి, ప్రథమ చికిత్స చేయించి, పంపించివేశారు.

గుర్తుతెలియని బాలిక కంకణాలపల్లిలో ప్రత్యక్షం


తప్పిపోయిన బాలిక

సత్తెనపల్లి: గుర్తుతెలియని చిన్నారి కంకణాలపల్లిలో ప్రత్యక్షమైన సంఘటన సోమవారం జరిగింది. ఆ చిన్నారి తనపేరు భాను అని చెబుతుంది. ఈ చిన్నారి సత్తెనపల్లి మండలం కంకణాలపల్లి గ్రామ సమీపంలో రోడ్డు పక్కన ఒంటరిగా ఉండగా చుట్టుపక్కల వారు కంకణాలపల్లి గ్రామ అంగన్‌వాడీ సెంటర్‌కు చేర్చగా అంగన్‌వాడీ సెంటర్ కార్యకర్తలు తగు చర్యల నిమిత్తం సత్తెనపల్లి రూరల్ పోలీస్ స్టేషన్‌కు చిన్నారిని తీసుకు వచ్చారు. చిన్నారి ఆచూకీ ఎవరికైనా తెలిస్తే సత్తెనపల్లి రూరల్ పోలీస్ స్టేషన్‌లో సంప్రదించవలసినదిగా పోలీసులు కోరారు.

గొడ్డలితో అన్నను గాయపరచిన తమ్ముడు

పెదకాకాని: ఆస్తుల వివాదంలో అన్నపై తమ్ముడు గొడ్డలితో దాడి చేసిన సంఘటన సోమవారం నంబూరులో చోటు చేసుకుంది. మండలంలోని నంబూరు గ్రామానికి చెందిన భీమిరెడ్డి వీరారెడ్డి, భీమిరెడ్డి వేణుగోపాలరెడ్డి అన్నదమ్ములు. వీరిద్దరి మధ్య గత కొంత కాలంగా ఆస్తి వివాదాలు జరుగుతున్నాయి. పెద్దల సమక్షంలోనూ, పోలీసుస్టేషన్‌లోనూ గతంలో మాట్లాడుకున్నారు. అయినప్పటికీ సమస్య పరిష్కారం కాలేదు. సోమవారం అన్న వీరారెడ్డి తన ఇంటి వద్ద ఉండగా వేణుగోపాల్ రెడ్డి గొడ్డలి తీసుకుని అతనిపై దాడి చేశాడు. దీంతో బాధితుడి భుజం వీపుపై గొడ్డలి గాయాలు అయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు బాధితుడిని చికిత్స నిమిత్తం గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

చోరీపై 'స్పందన' లేదు ఎస్పీ సాబ్!


అర్జీదారుల సమస్యను ఆలకిస్తున్న జిల్లా ఎస్పీ కె.ఆరిఫ్‌హఫీజ్, పక్కన ఏఎస్పీ శ్రీనివాసరావు

నగరంపాలెం: ఇంట్లో జరిగిన చోరీపై ఫిర్యాదు చేస్తే పోలీసులు పట్టించుకోవడం లేదని ఒకరు... ఉద్యోగాల పేరుతో మోసగించారని మరికొందరు ఎస్పీ గ్రీవెన్స్‌ను ఆశ్రయించారు. జిల్లా పోలీస్ కార్యాలయ (డీపీఓ) ఆవరణలో సోమవారం స్పందన (ప్రజా సమస్యల పరిష్కార వేదిక) జరిగింది. అర్జీదారుల నుంచి జిల్లా ఎస్పీ కె.ఆరిఫ్ హఫీజ్ అర్జీలు స్వీకరించారు. అర్జీదారుల సమస్యలను ఆలకించారు. అనంతరం సబ్ డివిజన్లు, పోలీస్ స్టేషన్ల సీఐలతో మొబైల్ ఫోన్, జూమ్ ద్వారా మాట్లాడారు. చట్టపరంగా ఉన్న సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు.

మలేషియాలో ఉద్యోగాలంటూ..

మేడికొండూరు మండలం డోకిపర్రు గ్రామానికి చెందిన వ్యక్తి సుమారు ఆరేళ్లుగా మలేషియాలో ఉంటున్నాడు. మిత్రుల ద్వారా అతను పరిచయమయ్యారు. ఈ క్రమంలో మలేషియాలో ఉద్యోగాలు ఇప్పిస్తామని అందర్నీ నమ్మించాడు. ఉద్యోగాలలో చేరాలంటే లక్షల్లో చెల్లించాల్సి వస్తోందని, గతంలోనూ పలువురికి ఇప్పించగా అక్కడ ఉద్యోగాలు చేస్తున్నారని చెప్పారు. విద్యా ర్హత ఆధారంగా జాబ్‌లు ఉంటాయని చెప్పగా అతని మాటలు నమ్మి, బ్యాంక్ ఖాతాకు నగదు దఫాల వారీగా పంపించాం. 45 రోజుల్లో ఉద్యోగాలు ఇప్పిస్తామని చెప్పి, ఏళ్లు గడిచాయి. ఉద్యోగాల విషయమై అడిగితే కాలయాపన చేసేవాడు. లేకపోతే ప్రభుత్వం మారిందని త్వరలో ఇప్పిస్తానని దాటవేసేవాడు. ఫోన్లు చేస్తే మాట్లాడేవాడు కాదు. తరువాత ఇష్టానుసారంగా మాట్లాడటం మొదలు పెట్టాడు. ఇక గుంటూరు నగరంలోని ఓ విత్తన కంపెనీకి సెక్యూరిటీ గార్డు గా పనిచేస్తున్న అతని తండ్రిని అడిగినా సరైన సమాధానం లేదు. ఇటీవల మలేషియా వెళ్లగా ఆరేడు నెలలుగా ఖాళీగా ఉన్నట్లు, ప్రస్తుతం ప్రైవేట్ ఉద్యోగం చేస్తున్నట్లు అబ్దుల్ సుబాన్ తెలిపారు. గతంలో తన వద్ద రూ.20 లక్షలు తీసుకున్నాడని, సదరు వ్యక్తిపై ఫిర్యాదు చేసేందుకు మలేషియా నుంచి గుంటూరు వచ్చినట్లు పేర్కొన్నారు. దాదాపు 15 మంది బాధితులు ఉన్నారని, వీసా, ఉద్యోగాల పేరుతో సుమారు రూ.80 లక్షల వరకు తీసుకున్నాడు.

– సయ్యద్ నాగూల్‌మీరా (తెనాలి), ఖాజాబిలాన్, అబ్దుల్ సుబాన్ (తురకపాలెం), షేక్.జానీభాషా (మేడికొండూరు), సయ్యద్ మౌలాలి. (బాధితులు)

లాటరీ వచ్చిందని..

రెండు నెలల క్రితం మొబైల్‌ఫోన్‌కు మేసేజ్ వచ్చింది. ఓ ఫౌండేషన్ నుంచి రూ.16.11 కోట్ల లాటరీ వచ్చిందని అందులో సారాంశం. ఆ మొత్తాన్ని డ్రా చేసుకోవాలంటే కనీస చార్జీలు చెల్లించాలని ముంబాయి నుంచి కాల్ చేసి మాట్లాడారు. ఈ క్రమంలో ఆదాయపు పన్ను, కరెన్సీ చార్జింగ్, ఎన్‌టీసీ, జీఎస్టీ, అలస్యపు జరిమానా ఇలా రకరకాల పేర్లతో సుమారు రూ.9 లక్షలు దఫాల వారీగా మొబైల్ ద్వారా చెల్లించా. చివరికి మోసం అని తెలుసుకున్నాక, అవతలి వైపు నుంచి సరైన స్పందన లేదు. – ఏఎస్.సాహెబ్, విశ్రాంత ఆర్మీ, శ్యామలానగర్ ఒకటో వీధి.

త్రుటిలో తప్పిన ప్రమాదం


ట్రాన్స్‌పోర్ట్ లారీని ఢీకొన్న ఆర్టీసీ బస్సు

- బ్రేకులు ఫెయిలై ట్రాన్స్‌పోర్టు లారీని ఢీకొన్న ఆర్టీసీ బస్సు
- ప్రయాణికులంతా సురక్షితం

నరసరావుపేట రూరల్: మండలంలోని ఉప్పలపాడు సమీపంలో ఆర్టీసీ బస్సుకు ప్రమాదం తప్పింది. శ్రీశైలం నుంచి మునుగోడుకు వెళ్తున్న ఆర్టీసీ బస్సు ఉప్పలపాడు సమీపంలోకి రాగానే బ్రేకులు ఫెయిల్ కావడంతో అదుపుతప్పింది. అదే సమయంలో నరసరావుపేట నుంచి వినుకొండ వెళ్తున్న ట్రాన్స్‌పోర్ట్ లారీని బస్సు ఢీ కొట్టడంతో నిలిచిపోయింది. ఈ ప్రమాదంలో ఆర్టీసీ బస్సుతోపాటు లారీ దెబ్బతిన్నాయి. బస్సులోని ప్రయాణికులు సురక్షితంగా బయటపడ్డారు.